నీలపు చీరెకు బెజ్జంలా ఆకాశంలో చంద్రుడు. భూమి మీద తెల్లని చీర పరచినట్లు వెన్నెల అడ్డూ ఆపుల వలన కలుగుతున్న చీకటివెలుగుల రేఖలుమిణు గురుల్లా కాంతు లీనుతున్నాయి. నక్షత్రాలు వెండి మబ్బుల మధ్య చంద్రుని దొంగాట. చెట్ల కదలికల వలన ఆకుల కదలికలు. కృష్ణానది పిల తెమ్మెరలు.

వీటన్నిటినీ ఆనందిస్తూ ఆరుబయట మంచంమీద భానుమూర్తి.

"ప్రకృతి ఎంత బాగుంటుంది" భానుమూర్తి ఆలోచన.

"ఆమె ఏం చేస్తున్నదో" పెంకు టింటి వైపు దృష్టి సారిస్తూ తిరిగి యోచన.

ఊరిని దూరంగా విసిరి వేయబడి నట్లున్న ఆ రెండు పెంకుటిళ్ళ మధ్యకు వెన్నెల కాంతిలో దారి సరిజూచుకుంటూ తల దించుకుని అపరాధిలా వచ్చారు గురుమూర్తిగారు.

"చివరి బండికి వచ్చేరా" భాను మూర్తి ప్రశ్న.

"అవును. పెందలకడనే బయ ల్దేరినా బండి అందలేదు" ఆయన జవాబు.

మాటల సవ్వడికి బయటకు వచ్చిన ఆమె వంక ఓ మారు చూశాడు భాను మూర్తి.

వెండిపళ్ళెం మధ్య జ్యోతిలా వుంది.

"కళ్ళకు నీళ్ళు తీసుకోండి" మెత్తని స్వరం.

ప్రక్షాళన గావించుకుని మంచం వాల్చుకు కూర్చున్నారు గురుమూర్తిగారు ఆయనకు ఎదురుగా భానుమూర్తి.

"భోజనం చెయ్యరూ"

"ఇదేమిటిలా అన్నాను?" అన్న తరు వాత అనిపించింది అతనికి.

"ఈ రోజు శనివారం కదా" గుర్తు చేస్తున్నట్లుగా వుంది ఆయన జవాబు.

"నిజమే"

"ఫలహారం లాంటిది ఏదైనా...."

"అలవాటుంది"

"మామయ్యా! లోపలికి వస్తారా...." సంశయంగా ఆమె.

"ఇక్కడికే పట్రావమ్మా ఇద్దరి కీనూ"

"అరే! భలేవారే. నేను భోజనం చేశాను మీరు తీసుకోండి" ఇబ్బందిగా కదిలాడు భానుమూర్తి.

రెండు ప్లేట్లలో ఫలహారం సర్ది ఇద్దరి మధ్యకు వచ్చింది ఆమె.

పళ్ళెం అందుకుంటున్నప్పుడు ఆమె వేళ్ళకు అతని చేతి వేళ్ళు తగిలి ఇద్దరిలో కొంతకలవరం. కనులచివర్లనుండి ఓసారి ఆమె వంక అతను చూపు

"బాగున్నాయమ్మా" పున్నాగ చెట్టుకు ఆనుకుని నిలబడ్డ ఆమెతో అన్నారు గురుమూర్తిగారు.

పకోడీలు నములుతున్న భానుమూర్తికి కూడా నిజమే ననిపించింది.

• • •

భానుమూర్తి ఆ వూరి స్కూలు మేష్టరుగా నియోగింపబడేటప్పటికి వున్న ఒక్క నానమ్మ కాస్తా పోయింది. గురు మూర్తిగారు ఆ వూరి స్కూలుకు ప్రధానోపాధ్యాయులు. మరో ఆరు నెలల్లో ఆయన రిటైర్ అవ్వబోతున్నారు అతను ఆ వూరికి వచ్చి నిండా నాలుగు

# సౌభాగ్యం

— రెంటాల హనుమత్ ప్రసాద్

నెలయి కాలేదు. స్కూలుకు వెళ్ళేటప్పుడు ఇద్దరూ కలిసి వెళ్ళడం.... వచ్చేటప్పుడూ అంతే. ఊరివాళ్ళకు తలలో నాలిక గురుమూర్తిగారు.

స్వయంపాకం చేసుకోవాలంటే విసుగ్గా వుంటున్నది అతనికి. ఇప్పుడనిపిస్తున్నది అతనికి. జనమ్మ బ్రతికి వున్నప్పుడే తెచ్చిన సంబంధాలు తిరగ్గొట్టకుండా వుండవలసిందని. గురుమూర్తిగారు ఒకటీ రెండూ సార్లు కదిలించారు. "ఇంకా ఎన్నాళ్లు ఇలా వుంటావయ్యా" అని. నవ్వి వూరుకున్నాడు సమాధానంగా.

అందానికి మరోపేరు అని ఎవరైనా అడిగితే వెంటనే చెప్పగలడు భానుమూర్తి. "సౌభాగ్యలక్ష్మి" అని. అలా ఆమెగురించి ఆలోచనా ప్రవంతి. కనులు మూసుకుని వున్నాడతను. తలుపు తెరుచుకుంది. ఆలోచనలు పుటుక్కుమన్నాయి కనులు విప్పి చూశాడు. చీకటిని పారద్రోలడానికి వెలుగును వెంట తెచ్చుకున్న ఆమె ఆలోచనలకు ప్రతిరూపం ఎదురుగా కనుల ముందు.

"మీరా!" ఆశ్చర్యంగా అతను

"ఒంట్లో నలతగా వుందిటగా." గోడ మీది పటాన్ని చూస్తూ అన్నది ఆమె

"అవును రాత్రి నుండి బావోలేదు"

"వంట చేసుకోడానికి ప్రయత్నించకండి. మామయ్యగారు చెప్పమన్నారు చారు కాచేను ఆ నాలుగు మెతుకులేవో మా ఇంట్లోనే తిందురు"

ఇబ్బందిగా కదిలాడు భానుమూర్తి. ఏమని చెప్పాలో తోచలా. కాదనలేకపోవడం అతని బలహీనత. అతనివంక చూడటానికి ఏదో జంకు ఆమెలో. ఎటో చూస్తూ చెప్పి వెళ్ళిపోయిందామె.

* * *

కాలం పరిచయాన్ని పెంపొందించింది ఆయనతో పాటు ఆమెతో భానుమూర్తికి రోజూ సాయం సమయంలో వాకింగ్ నిమిత్తం అలా దూరంగా పొలాల మధ్యగా గురుమూర్తిగారు. ఆరుబయట రెండిళ్ళ మధ్య సౌభాగ్యలక్ష్మి భానుమూర్తి కుర్చీలలో కూర్చుని తాము చదివిన పుస్తకాల మీద చర్చలు ఆ చర్చలవలన తెలిసింది ఒకరి కొకరికి సాహిత్యంలో మంచి పరిచయముందని. సౌభాగ్యలక్ష్మి చదవని పుస్తకంలేదని రూఢి అయింది భానుమూర్తికి. మంచి పుస్తకాలు అంటూ ఏమైనా వుంటే అవి భానుమూర్తి రాక్‌లో వున్నాయని కూడా వెల్లడయింది ఆమెకు.

"మీరు ఈ నవలని ఎప్పుడు వ్రాశారు?

"నేను ఐదేళ్ళ క్రితం వ్రాశాను. నేను వ్రాసిన మొదటి నవల ఇదే అప్పట్లో ఈ నవలకు మంచి పేరు వచ్చింది .... మీ కెలా వుంది?

"జీవితంలా వుంది."

అంటే....?"

"ఏం చెప్పమంటారు? మీరు కల్పించిన ఆ పాత్ర జీవితంలో నా పాత్ర వంటిదే. చిన్నతనంలోనే భర్తను పోగొట్టుకుని వయసు వలన కలిగిన కోరి

కలను అణుచుకుంటూ బ్రతుకుతుండగా ఇంకో పాత్రను సృష్టించారు ఆ రెండు పాత్రలు చేరువ అవుతాయి. ఆమెలో అణగారిపోయి వున్న కోరికలకు జీవితం మీద ఆశను కలిగిస్తాడు అతను. కానీ మీరు ఏం న్యాయం చేకూర్చారు. ఆఖరికి సమాజానికి ఈ మూర్ఖపు సాంఘిక కట్టుబాట్లకు జడిసి ఇద్దరూ చెట్టుకో పుట్ట అవుతారు. మీరు ఆ పాత్రలకు ఏ రకంగానూ న్యాయం చేకూర్చలేదు ...." కొద్దిగా ఆవేశంగా ఆమె.

కొలదిపాటి ఆశ్చర్యంభానుమూర్తికి. గురుమూర్తిగారి రాకతో ఇద్దరిమధ్య సంభాషణ ఆగింది. ఆమె లోనికి నడిచింది. ఆయన స్నానానికి నీళ్ళు తోడడానికి. గురుమూర్తిగారు వచ్చికుర్చీలో చతికిలబడ్డారు. ఇద్దరి మధ్యా స్కూలు గురించీ, విద్యార్థుల గురించీ, తోటి మాష్టర్ల గురించి సంభాషణ నడిచింది.

* * *

"మీరు ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?"

"ఉత్తినే"

ఈ జవాబు ఆమెకు రుచించలేదు కాబోలు, "కారణమేమీ లేదా?"

"అంతే...."

"అంతే....మీరు ఎప్పుడన్నా ఎవరినన్నా ప్రేమించారేమోనని; ఆ ప్రేమ బెడిసికొట్టి ఇలా పెళ్ళి పెటాకులు లేకుండా...." నవ్వుతూ ఆమె

అలా నవ్వుతుంటే రవికె క్రిందుగా పొట్టమీద ఒకటి రెండు ముడతలు అందంగా ఏర్పడ్డాయి.

"అలాంటిదేమీ లేదు. పుట్టి బుద్ధెరిగాక మా నానమ్మను తప్పితే మరెవర్నీ ప్రేమించలేదు — ప్రేమించబడలేదు కూడా...." నవ్వాడు అతను.

"చంపుతున్నారు బాబూ! నే ననేది మీ నానమ్మమీద వున్న ప్రేమ గురించి కాదు ఇంకో స్త్రీని గురించి."

ముత్యాలు రాలలేదు గదా ఆమె నవ్వితే

"ఈ ఊరు వచ్చేదాకా నేనే అమ్మాయిని ప్రేమించలేదు. మీరు నమ్మితీరాలి."

"నన్నెందుకు బాబూ నమ్మించడం. మీరు అంటూనే వున్నారుగా, ఈ వూరు వచ్చేదాకా ఏ అమ్మాయినీ ప్రేమించలేదనీ. ఈవూరు వచ్చిన తరువాతగానీ.." మాటలు పూర్తిచేయకుండా అతని కనులలోకి నవ్వుతూ చూసింది ఆమె.

ఆమె అలా కనులలో కనులు నిలిపేటప్పటికి తడబడ్డా డతను. చటుక్కున తలదించుకొని నవ్వు పూరుకున్నాడు.

"ఇంకా ఎన్నాళ్ళండీ మీ నలభీమపాకం? మీరు 'వూఁ' అనండి-చక్కటి అమ్మాయిని చూసి ముడివేయిస్తాను"

"ఓ! నాకేం అభ్యంతరం లేదు. లక్షణంగా చేసుకుంటా. ఐతే ఒకటి షరతు. మీరు చూసే అమ్మాయిలో నేను కోరేవన్నీ వుండాలి. ఒకటి మీ అందం. రెండు మీ మాటకారితనం, మూడు మీ మనస్సు. ఇంకా ఇంకా చెప్పాలంటే అచ్చు మీలా...." అతను మాట పూర్తి చేయకముందే ఆమె కుర్చీలో నుండి చటుక్కునలేచి అతని కనులలోకి ఒక్కక్షణం చూపునిలిపి లోనికివెళ్ళిపోయింది

కలవరపడ్డా డతను. ఆమె అలా చూసిన చూపులో ఏ భావాన్నీ చదవలేకపోయాడు. తొందరపడి అనవసరంగా నోరుజారానా అనిపించకపోలేదు అతనికి.

* * *

"రా వో య్ రా!" ఆహ్వానించారు గురుమూర్తిగారు. అప్పుడే దీపారాధన ముగించినట్లున్నారు. ధావళితో వంటికి అలుముకున్న చెమట బిందువులతో నుదుట తడిసిన కుంకుమతో ఒక్క క్షణం కొత్తగా కనబడ్డారు.

తరచి తరచి వడ్డించింది ఆమె. భోజనం మధ్యలో అన్నారాయన.

"తిరుపతి వెంకటేశ్వరుని దర్శనం చేసుకుని రావాలని వుంది భానుమూర్తీ"

"మీరు ఎప్పుడూ వెళ్ళలేదా."

ప్రశ్న వేసిన తరువాతగాని తోచదు. అతనికి ఇది వెర్రి ప్రశ్న కాదని.

"ఈ మధ్య కాలంలో ఎప్పుడూ వెళ్ళలేదు. దాదాపు పదేళ్ళక్రితం వెళ్ళాను. ఈ మధ్య నా కలలో స్వామి వారు కనిపించారు. అప్పటినుండి బయలు దేరాలనుకుంటూనే వున్నాను. నీవు కూడా రాకూడదూ ఇప్పుడెలానూ స్కూలుకు సెలవ లిచ్చారుకదా అలా తిరిగొద్దాం. ఆ స్వామివారి దర్శనం చేసుకున్నట్లు వుంటుంది, అభ్యంతరం ఏదైనా...."

ఆ దివ్యమంగళ మూర్తిని ఓసారి కనులారా దర్శిద్దామా అనిపించింది భానుమూర్తికి.

"ఏమంటావ్?"

"కాదన బుద్ధికాలేదు. దైవమహత్యమేమో అతని వెంట అతని ప్రమేయం లేకుండానే "అలాగే" అనేసేడు.

ఇదరూ భోజనాలు ముగించి లేచారు.

* * *

"అబ్బ! ఇక్కడ ఎండ కరుస్తున్నా చలిగానే వుంటుందే" అన్నది ఆమె చీరె చెరగు భుజంచుట్టు కప్పుకుంటూ.

"కొండప్రాంతం కదామరి."

"కాటేజీ ముందర పలుచగావున్న గడ్డిలో ఒక ప్రక్కగా కూర్చుని వున్నారు భానుమూర్తీ, సౌభాగ్యలక్ష్మి

సంధ్యను పారద్రోలి చీకటి ప్రవేసించింది

"స్వామివారి దర్శనంకోసం మనం మూడు గంటలసేపు వేచి వున్నా మనుకుంటా" చల్లని గాలికి ఆడుతున్న ముంగురులను నుదుటి మీదినుండి వెనక్కినెడుతూ అంది ఆమె.

"మీ మామయ్యగారు నిద్రబోతున్నట్లున్నారు."

"అవును. ఆయన బాగా అలసినట్లున్నారు, ఆద మరిచి నిద్రపోతున్నారు"

"పెద్ద వయసు కూడాను మరి"

"పరిసరాలను చూస్తుంటే కలుక్కుమంటున్నది గతం గుర్తుకొచ్చి" మోకాళ్ళ మీద గడ్డం ఆన్చి అన్నది ఆమె.

"ఏమిటో?"

"నా పెళ్ళిరోజు" గతం తాలూకు నీడలు కదిలాయి. ఆమె వదనంలో.

"మీ పెళ్ళి ఇక్కడా జరిగింది"

"అవును. స్వామి వారి సన్నిధిన జరిపించారు, ఈ రోజు నా బ్రతుకు తెల్లవార్చుకుని ఇక్కడకు ఇలా వస్తానని ఆ రోజు నాకు తెలుసా" నీటి సుడి ఆమె కనులలో వూరింది.

"ఒకటడుగుతాను మీకు కోపం రాదు గదా...." కొద్దిగా సంశయిస్తూ పలికాడు.

"కోపగిగించుకోవడం జరగదులేండి. మీరు నిరభ్యంతరంగా అడగొచ్చు" నవ్వును పులుముకుంటూ అన్నది అమె.

"మీరు మరలా ఎందుకు వివాహం చేసుకోకూడదూ"

"వూహించని ఆ ప్రశ్నకు ఆమెలో

పులికిపాటు. కప్పి పుచ్చుకోవాలని ప్రయత్నంచేసి వ్యర్థమయింది.

"ఏమిటిలా బెదిరినట్లయ్యారు. ఏదో వినరానిదేదో విన్నట్లు ఈ కాలంలో ఎంత మంది పునర్వివాహం చేసుకోవడంలేదు. మీరీ వయస్సులో కోరికలు అణుచుకుంటూ సౌభాగ్యానికి దూరమై మోడివారిన మొక్కలా వుండడం ఏం న్యాయం. పురుషుడికి ఒక న్యాయం స్త్రీకి ఒక న్యాయమా. అదెలా మగవాడి భార్యగనుక దూరమైతే తిరిగి మరలా వివాహం చేసుకోవడంలా. స్త్రీకి ఒక్కదానికేనా ఈ కట్టుబాటు. మీకు మాత్రం ఆశలు కోరికలూ వుండవా.

నే నడిగిన దానికి సమాధానం కావాలి. మీరు మాత్రం అందరిలా ఎందుకు జీవించకూడదు" ఆవేశంగా అన్నాడు భానుమూర్తి.

అంతవరకు కనులు పెద్దవిచేసి ఆశ్చర్యంగా వుండిపోయిన ఆమె అతని ప్రశ్నకు వులిక్కిపడింది.

"నా ప్రశ్నకు సమాధానం ఇవ్వండి" ఉద్వేగంగా అన్నాడు.

"జీవించవచ్చు. కాని ఈ సంఘంలో కట్టుబాట్లున్నాయి. వాటిని అతిక్రమిస్తే కొన్ని కష్టాలు ఎదురవవొచ్చు. వాటికి ఎదురుతిరిగి నిలబడాలి ఆ తెగింపువుంటే మరలా జీవించవచ్చు. అంత ధైర్యం చేసి చేపట్టేవాడు వుండాలిగా" కనులు దించుకుని అన్నది ఆమె.

"మరలా నాతో ఏడడుగులు నడవగలరా. నేను మీమీదేదో సానుభూతితో ఇలా మాట్లాడుతున్నానని అనుకోవద్దు. మీరంటే నాకున్న అభిమానం.... ప్రేమ.... అనురాగం నన్ను పురిగొల్పుతున్నాయి. నా జీవితంతోపాటు మీ జీవితం కూడా ముడివేసి చివరిగా కలసి బతుకుదాం. ఏమంటారు. దయచేసి కాదని మాత్రం అనవద్దు." ఏదీ తెలియని ఉద్వేగం అతనిలో.

అప్పటిదాకా అప్రతిభురాలై వుండిపోయిన ఆమె కొద్ది క్షణాలు ఆగి అన్నది "ఈ మోడు వారిన మొక్కకు నీళ్ళు పోస్తున్నారు"

* * *

కళ్యాణ మండపంలో బాజా బజంత్రీల మధ్య జంటలలో ఒక జంటగా పీటలమీద వున్నారు సౌభాగ్యలక్ష్మి భానుమూర్తి.

తలెత్తి చూడగా ఇద్దరి కనులముందు నిలబడివున్నారు గురుమూర్తిగారు అక్షింతలు రాలుస్తూ.

"ఈ మనకు ఎలా తెలుసు మా ఇద్దరి వివాహం గురించి తాము చెప్పలేదే" అనుకుంటూ ఆయన కాళ్ళకు వినయంగా నమస్కరించారు. ఇద్దరినీ ఆశీర్వదించి దగ్గరగా తీసుకుంటూ

"నా కోరిక తీరింది. నా కోడలికి న్యాయం చేకూర్చాను వాళ్ళిద్దరి మధ్య అడ్డురాకుండా వాళ్ళని దగ్గరిగా చేకూర్చటంలో కృతకృత్యుడనయ్యాను" అనుకున్నారు రాత్రి వాళ్ళ సంభాషణవిని అక్కడికి వచ్చిన గురుమూర్తిగారు.

Edited & Published by Smt. B. Vijayalakshmi Raj at Seetharampuram, Vja-4.
Printed by her at Swatantra Art Printers, Vja-4. Regd. No. H/Vj. 25434/75.